
సాక్షి
పల్నాడు

గురువారం । 10 । ఆగస్టు । 2023



అమరేశ్వరుని సేవలో...

అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామిని సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ ఫైనాన్సియల్ ఎడ్వయిజర్ వెంకటరెడ్డి బుధవారం దర్శించుకున్నారు.



డెల్టాకు 3,503 క్యూసెక్కులు

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 3,503 క్యూసెక్కులు బుధవారం విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1,260 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 515.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

న్యూస్‌రీల్

సీసీఐ గుంటూరు ఆస్తుల విలువ రూ.1.859 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ గుంటూరులోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సీసీఐ) ఆస్తుల మొత్తం విలువ రూ.1.859 కోట్లు అని కేంద్ర జౌళిశాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. లోక్‌సభలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ తలారి రంగయ్య ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. భూమి, భవనం, ఫర్నీచరు, కంప్యూటర్ ఎక్విప్‌మెంట్, కార్యాలయ ఎక్విప్‌మెంట్, వెహికల్స్ అన్నీ కలిపి ఈ మొత్తం విలువ అని తెలిపారు.

కారాగార కార్యకలాపాలపై అవగాహన



గుంటూరు లీగల్: ఏపీ హైకోర్టు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారథి ఆదేశాల మేరకు ప్రాక్టికల్ శిక్షణ నిమిత్తం 11 మంది జూనియర్ సివిల్ జడ్జిలు బుధవారం గుంటూరు జిల్లా కారాగారాన్ని సందర్శించారు. జిల్లా కారాగార పర్యవేక్షణాధికారి కె.రఘు ముద్దాయిలకు సంబంధించిన సౌకర్యాలు, వారికి కల్పించే న్యాయ సహాయం వివరాలు, కారాగార పరిపాలన తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. కోర్టులు, కారాగారాల మధ్య జరిగే కార్యకలాపాలను వివరించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జిలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కారాగార వైద్యాధికారి కె.లక్ష్మీ పూర్ణలత, జైలర్లు బి.తేజేశ్వరరావు, సీహెచ్ కిరణ్, డిప్యూటీ జైలర్లు టి.వెంకటరత్నం, బి.శ్రీనివాసరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వందేభారత్ రైలులో పొగలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20702) రైలులో బుధవారం పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై రైల్వే అధికారులు వివరణ ఇచ్చారు. బుధవారం తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో ఒక ప్రయాణికుడు తిరుపతిలో రైలు ఎక్కాడు. రైలు గూడూరు దాటిన తరువాత ఆ ప్రయాణికుడు సీ-13 కోచ్‌లోని టాయిలెట్‌లోకి వెళ్లి పొగ తాగుతుండగా టాయిలెట్ లోపల ఉన్న ఏరోసోల్ ఫైర్ వ్యవస్థ స్పందించి పొగతో కూడిన పౌడర్‌ను విడుదల చేసింది. ఫలితంగా రైలులో పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు భయపడ్డారు. ఎమర్జెన్సీ టాక్ బ్యాక్ యూనిట్ (ఈటీబీయూ) ద్వారా గార్డ్‌కు సమాచారం అందడంతో రైలును మనుబోలు వద్ద నిలిపివేశారు. ప్రమాదాన్ని పసిగట్టిన ఆన్ డ్యూటీ ఆర్‌పీఎఫ్ సిబ్బంది అగ్నిమాపక యంత్రాలతో ప్రమాదం జరిగిన కోచ్ వద్దకు చేరుకుని ప్రయాణికుల సాయంతో టాయిలెట్ అద్దాలను పగులకొట్టి పొగలో చిక్కుకున్న ప్రయాణికుడిని రక్షించారు. దీంతో రైలు మనుబోలు వద్ద సాయంత్రం 4.46 గంటల నుంచి 5.10 వరకు నిలిచిపోయింది. అనంతరం ఘటనకు కారకుడైన ప్రయాణికుడిని నెల్లూరు ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రైలు ప్రయాణంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

దక్షిణ భారత బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడాకారులు



విజయవాడ స్పోర్ట్స్: దక్షిణ భారత బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌నకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్ర రాష్ట్ర జట్టులో విజయవాడ క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి వారు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. జూనియర్ బాలుర విభాగంలో టి.హర్షన్, జి.దిలీప్‌కుమార్, బాలికల విభాగంలో టి.సూర్యచరిష్మ, డి.రష్మిత, సీనియర్ మహిళల విభాగంలో టి.సూర్యచరిష్మ, డి.రష్మిత, మమైఖ్య ఎంపికయ్యారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు తమిళనాడు కోయంబత్తూరులోని పల్లికూడమ్ క్యాంపస్‌లో జరిగే దక్షిణ భారత బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో వారు పాల్గొంటారు. ఈ జట్టుకు కోచ్‌గా వి.గంగాధరరావు, మేనేజర్‌గా డి.ధనలక్ష్మి వ్యవహరిస్తారు. రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్న క్రీడాకారులను కృష్ణాజిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పరసా శ్రీనివాస్ అభినందించారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం



పసుమర్రులో రక్షిత తాగునీటి పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని

- పసుమర్రు వాసుల దశాబ్దాల కష్టాన్ని తీర్చాం
- గత ప్రభుత్వం తాగునీటి సమస్య తీర్చలేకపోయింది
- రూ.6 కోట్లతో సమస్యకు పరిష్కారం చూపాం
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో పల్లెసీమలు అభివృద్ధి పథం వైపు దూసుకుపోతున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పురపాలక సంఘంలో విలీన గ్రామమైన పసుమర్రులో నాబార్డు నిధులు రూ.6 కోట్లతో నిర్మించిన రక్షిత తాగునీటి పథకాన్ని బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా నెరవేరని కలగా మిగిలిన పసుమర్రుకు సాగర్ జలాల తరలింపు కార్యక్రమం ఈ రక్షిత తాగునీటి పథకం ద్వారా సాధ్యమైందని వివరించారు. దీని కోసం చిలకలూరిపేట తాగునీటి చెరువు సమీపం నుంచి పసుమర్రు వరకు పైపులైను ఏర్పాటు చేసి సాగర్ నీటిని తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు కనీసం ఇక్కడి ప్రజలకు తాగునీటిని అందిద్దామని ఆలోచన చేయలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏకంగా రూ.6 కోట్లు నిధులతో తాగునీరు అందించే పనులకు శ్రీకారం చుట్టారని చెప్పారు. రోజుకు ఒక మిలియన్ లీటర్ల నీటిని గ్రామస్తులకు అందించే సామర్థ్యంతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ పథకం వల్ల ఏడు వేల జనాభాకు తాగునీటి అవసరాలు తీర్చే అవకాశం కలిగిందని వివరించారు.

ఎనిమిది వేల మందికి ఇళ్లు

పసుమర్రు గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. జగనన్న కాలనీలను కూడా ఇక్కడే ఏర్పాటు చేశామని తెలిపారు. 8 వేల మందికి ఇళ్ల నిర్మించేలా మూడు లేఅవుట్లు గ్రామ పరిధిలో అభివృద్ధి చేసినట్లు వివరించారు. ఇటీవల దాదాపు రూ.30 కోట్లతో వంద పడకల ఏరియా ఆస్పత్రి కల సాకారం చేసుకున్నామని చెప్పారు. నాడు- నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలకు మించిన హంగులు సంతరించుకున్నాయని పేర్కొన్నారు. వీటికి తోడు అదనంగా గురుకుల పాఠశాల విద్యార్థులకు కొత్త భవనాలు వచ్చాయని చెప్పారు. ఇప్పటికే రాజాపేటలో ఒక భవనం ప్రారంభించగా, త్వరలో బోయపాలెంలో మరో భవనం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కేంద్రీయ విద్యాలయాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు.

బైపాస్ పనులు వేగంగా..

పట్టణ ప్రాంతాల్లో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా కోర్టు వివాదాలు ఇతర కారణాలతో ఆగిపోయిన బైపాస్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. రూ.700 కోట్లతో బైపాస్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, 15,16 వార్డు కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, కొమరవల్లిపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొండవీటి ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతుకు అగ్రహారం

- భూముల సర్వే ప్రారంభం
- 8,400 మందికి పైగా రైతులకు లబ్ధి
- అప్పాపురం, గుమ్మనంపాడు గ్రామాల్లో పూర్తయిన సర్వే



'ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి ఎం.చెన్నారెడ్డి. వి.అప్పాపురం గ్రామం. వారసత్వంగా అగ్రహారం భూముల్లో ఎనిమిది ఎకరాలు ఉంది. అయితే భూములపై ఎలాంటి హక్కులు లేవు. విపత్కర పరిస్థితుల్లోనూ కష్టాలు పడ్డారు. కేవలం అగ్రిమెంట్ల ఆధారంగానే లావాదేవీలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం అగ్రహారం భూములు సర్వే చేసి హక్కులు కల్పిస్తుంది.' ఎన్నో ఏళ్ల తరువాత హక్కులు కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ధన్యవాదాలు తెలిపారు.



సర్వే పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): అగ్రహారం భూముల రైతులకు మోక్షం లభించింది. వందల ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు పొందే అవకాశం ప్రభుత్వం కల్పిస్తుంది. భూములున్నా ప్రభుత్వం అమలు చేసే పథకాల లబ్ధిని పొందలేకపోతున్నారు. దీంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన వీరికి మాత్రం సాయం అందేదికాదు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్రహార భూముల రైతుల కష్టాలను గుర్తించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అసెంబ్లీలో భూముల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సర్వే చేసి హక్కులు అప్పగించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో 17,250 ఎకరాలకు మోక్షం లభించింది. మొదటి విడతగా సర్వే ప్రక్రియ పూర్తి చేశారు.

అప్పాపురం, గుమ్మనంపాడు గ్రామాల్లో సర్వే పూర్తి నూజెండ్ల మండలం అప్పాపురంలో 2022 నవంబరు 9వ తేదీన భూముల సర్వే ప్రక్రియను ఎమ్మెల్యే బొల్లా లాంఛనంగా ప్రారంభించారు. 2070 ఎకరాల అగ్రహార భూముల సర్వే ప్రక్రియ పూర్తవడంతో పాటు ఫీల్డ్ మ్యాప్‌లను తయారు చేశారు. గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి త్వరలో ఫారం-5, 8 రైతులకు ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు. అలాగే బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడులో ఐదువేల ఎకరాల అగ్రహార భూములు ఇప్పటికే సర్వే పూర్తయింది.



అప్పాపురంలో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

అగ్రహారం భూముల వివరాలు

మండలం	గ్రామం	ఎకరాలు
నూజెండ్ల	వి. అప్పాపురం	2070
నూజెండ్ల	తిమ్మాపురం	1600
నూజెండ్ల	కొండ్రప్రోలు	1870
బొల్లాపల్లి	గుమ్మనంపాడు	5000
బొల్లాపల్లి	అయ్యన్నపాలెం	2771
ఈపూరు	అంగలూరు	1266
వినుకొండ	నాగులవరం	662
వినుకొండ	శివాపురం	2011

లబ్ధి పొందనున్న రైతులు..

నియోజకవర్గంలోని నూజెండ్ల మండలంలో మొత్తం 8,400 మందికి పైగా రైతులు లబ్ధి పొందనున్నారు. అందులో వి.అప్పాపురం 650 మంది, తిమ్మాపురం 1400, కొండ్రప్రోలు 1060, వినుకొండ రూరల్ మండలం శివాపురం 1200, నాగులవరం 300 మంది, ఈపూరు మండలం అంగలూరులో 790, బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడు 1800, అయ్యన్నపాలెంలో 1325 మంది ఉన్నారు.

త్వరలో రైతులకు పూర్తి హక్కులు



దశాబ్దాలుగా అగ్రహారం భూములు సర్వేకు నోచుకోలేదు. ఇబ్బందులు ఎదుర్కొన్నాం. హక్కులు లేకపోవడంతో ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఎమ్మెల్యే బొల్లా చొరవతో రీసర్వే ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే రైతులకు పూర్తి హక్కులు రానుండటం హర్షణీయం. ప్రభుత్వ నిర్ణయానికి ధన్యవాదాలు.

–పొట్లపల్లి పిచ్చిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు, అప్పాపురం

గత పాలకులు పట్టించుకోలేదు..

దశాబ్దాల తరబడి అగ్రహారం భూములు దాదాపు 17,250 ఎకరాలు ఉన్నాయి. రైతులు ఇబ్బంది పడ్డారు. రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో పంచాయతీలకు కూడా ఆదాయం లేక గ్రామాల్లో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. సమస్యను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లా. సీఎం వైఎస్ జగన్ స్పందించి సర్వే చేయాలని ఆదేశించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో ముందుకు పోతున్నాం.

–బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్యే, వినుకొండ

నులిమేద్దాం..!



కేంద్రీయ విద్యాలయలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫణిదం పీహెచ్‌సీ వైద్యురాలు కవిత తదితరులు

- చిన్నారుల్లో రక్తహీనత కలిగిస్తున్న నులి పురుగులు
- పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ
- జిల్లాలో 19 ఏళ్లలోపు 4,15,968 మంది
- నేడు నులిపురుగుల నియంత్రణ దినం
- కార్యక్రమాన్ని నరసరావుపేటలో ప్రారంభించనున్న కలెక్టర్ ఎల్.శివశంకర్

సత్తెనపల్లి: నులిపురుగులు కంటికి కనిపించకుండా పేగుల్లో మకాం వేసి రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తూ రక్తహీనతకు గురిచేస్తుంది. కొంకి పురుగులు, నట్టలు(ఏలికపాములు) తోపాటు ఈ నులి పురుగులు 38 శాతం అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న వైద్యనిపుణులు చెబుతున్నారు. 5 నుంచి 19 ఏళ్ల లోపు వారే నులిపురుగుల సమస్యతో బాధపడుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. వీటన్నంటికీ అపరిశుభ్రతే కారణం. జిల్లా వ్యాప్తంగా గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఇందుకు వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది.

జిల్లాలో కార్యక్రమం ఇలా..

పల్నాడు జిల్లాలోని పట్టణాలు, మండలాల్లో 19 ఏళ్ల లోపు వయసున్నవారు 4,15,968 మంది పిల్లలున్నారు. 4,202 ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం నుంచి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయనున్నారు. ఇందుకు గాను ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలను నియమించారు. విద్యా శాఖ, ఐసీడీఎస్‌ను భాగస్వాములను చేశారు. వీరి ద్వారా అందించేందుకు ముందుగానే మాత్రలు పంపిణీ చేశారు.

మాత్రల పంపిణీ....

జాతీయ నులిపురుగుల నియంత్రణ దినంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రను అందించనుంది. ఏడాది నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా, ఆరేళ్ల నిండి 19 ఏళ్ల లోపు ఉన్న వారికి స్కూళ్లు, కాలేజీల్లో మాత్రల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నారు. ఏడాది నుంచి రెండేళ్ల వయసున్న చిన్నారులకు 200 మిల్లీ గ్రాములు (అర్ధ) మాత్ర, రెండేళ్ల నుంచి 19 ఏళ్ల వయసు వారికి 400 మిల్లీగ్రాములు చొప్పున మింగించాల్సి ఉంటుంది.

'నులి' నియంత్రణకు సహకరించాలి



జిల్లాలో నులి పురుగుల నియంత్రణకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలి. నులిపురుగుల నివారణ మాత్రలు మింగించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దు. భోజనం తర్వాత దగ్గరుండి మింగించాలి. పిల్లలకు ఆరోగ్య సమస్య లుంటే ముందుగానే గుర్తించి.. డాక్టర్ల సలహాలు తీసుకోవాలి. నరసరావుపేట మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం 2గంటలకు కలెక్టర్ లోతేటి శివశంకర్ ప్రారంభించనున్నారు.

–డాక్టర్ చంద్రశేఖర్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్

వ్యాప్తి ఇలా ...

- కలుషిత, ఈగలు వాలిన పదార్థాలు తినడం
- వ్యక్తిగత పరిశుభ్రత లోపించిన చేతి గోళ్ల ద్వారా
- బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన, చెప్పుల్లేకుండా మరుగుదొడ్ల వాడకం
- అపరిశుభ్ర పరిసరాల్లో పిల్లలు ఆడుకునేటపుడు

రక్తహీనతతో...

- నులి పురుగులు పిల్లల్లోని రక్తాన్ని పీల్చి, వృద్ధి చేందుతాయి
- దీంతో రక్తహీనత కలిగి, నీరసించి పోతారు
- ఆయాసం, దగ్గుతో ఇబ్బంది పడతారు. పిల్లల బరువుతో పాటు ఎదుగుదల తగ్గిపోతుంది.
- చర్మంపై దద్దుర్లు వస్తాయి
- తరచూ కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, తలనొప్పి, ఆకలి మందగించడం వంటి లక్షణాలు వేధిస్తాయి.
- చదువులో ఏకాగ్రత లోపించి, నేర్చుకునే సామర్థ్యం తగ్గిపోతుంది.

సామాజిక మార్పుకు దోహదం

- జిల్లా కలెక్టర్ శివశంకర్
- వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫాతో జిల్లాలో 526 మందికి లబ్ధి



నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

నరసరావుపేట: సామాజిక, ఆర్థిక వెనుకబాటు నుంచి బయటకు రావడానికి సామాజిక మార్పుకు ఈ పథకం దోహదం చేస్తుందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. వైఎస్సార్ కల్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకం కింద 2023 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న జంటలకు ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి నుంచి వర్చువల్‌గా బుధవారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ శివశంకర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద జిల్లాలో 526 జంటలకు రూ.4,46,70,000 మంజూరు అయినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఇది ఎంతో సహాయంగా ఉంటుందని వివరించారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు.

ఇంటింటా మొక్కలతో ఆరోగ్యకర జీవనం

పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి మురళి




అజాదీకా అమృత్ మహోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

అచ్చంపేట: ఇంటింటా మొక్కలు నాటి ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన జీవనాన్ని కొనసాగించాలని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేక అధికారి ఐ.మురళి సూచించారు. ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోనూరులో బుధవారం ఆయన నా భూమి- నా దేశం, నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులనుద్దేశించి మాట్లాడారు. మొక్కలు మనిషికి కావలసిన ప్రాణ వాయువును ఇచ్చి, వదిలేసిన కార్బన్‌డై ఆక్సైడ్‌ను గ్రహిస్తాయని చెప్పారు. సకాలంలో వర్షాలు పడేందుకు దోహదపడతాయని తెలిపారు. నీడ, ఫలాలు, పూలను ఇచ్చే మొక్కల్ని ప్రతి ఇంట్లో నాటుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సూచించిన విధంగా స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలను భావితరాలకు అందిద్దాం, పుడమితల్లిని కాపాడుదాం అంటూ గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన స్థానిక మండల పరిషత్ పాఠశాల, పీహెచ్‌సీ సబ్ సెంటర్, రోడ్ల పక్కన మొక్కలు నాటాలు. గ్రామస్తులు వాటిన సంరక్షించే బాధ్యత చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం, ఉపాధి హామీ పథకం ఏపీవో నాగశ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు నులి పురుగుల నియంత్రణ దినం

- అన్ని పాఠశాలల్లో కార్యక్రమం
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ శోభారాణి



నరసరావుపేట: జాతీయ నులిపురుగులు నియంత్రణ దినాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.శోభారాణి కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం అధికారుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఏడాదిలో రెండో పర్యాయం గురువారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం భోజనం తర్వాత ఒకటి నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు సగం (200మిల్లీగ్రాముల) ఆల్బెండజోల్ బిళ్లలను మెత్తగా చేసి నీళ్లలో కలిపి జాగ్రత్తగా అంగన్‌వాడీ సెంటర్లలో తాగించాలని కోరారు. ఎలిమెంటరీ స్కూల్, హైస్కూల్స్ , జూనియర్ కళాశాలల్లో ఫుల్ టాబ్లెట్ ఆల్బెండజోల్ (400మి.గ్రా) నమిలి మింగించాలని చెప్పారు. టాబ్లెట్ మింగించిన తర్వాత పిల్లలను అర్ధగంట సేపు పరిశీలనలో ఉంచాలని, వెంటనే స్కూలు వెలుపలకు పంపకూడదన్నారు. టాబ్లెట్లను మింగించిన తర్వాత ఏవైనా ఆరోగ్య సమస్యలు అనగా చర్మంపై దద్దుర్లు, కండ్లు తిరగటం, వాంతులు, కడుపునొప్పి వంటివి ఉంటే వెంటనే సంబంధిత ఆరోగ్య కార్యకర్తలు, వైద్యాధికారులకు వెంటనే తెలియజేసి 108లో సమీపంలోనే ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు తరలించాలని కోరారు. తల్లిదండ్రులు విద్యాసంస్థలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ ముందస్తు జాగ్రత్తలు తీసుకొని కార్యక్రమాన్ని విజయవంతానికి సహకరించాలని కోరారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని రకాల పరీక్షలు

- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఏరియా వైద్యశాలలో ఈఎస్ఆర్ ఎలైజర్స్ ప్రారంభం



రక్తపరీక్ష కేంద్రంలో పరికరాలు ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ప్రభుత్వ వైద్యశాలల్లోనే అన్ని రకాల పరీక్షలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. స్థానిక ఏరియా వైద్యశాలలో అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. తొలుత రక్త పరీక్ష కేంద్రంలో కొత్తగా వచ్చిన పరికరాలను ప్రారంభించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ రెండు నియోజకవర్గాలకు చెందిన రోగులు ఇక్కడికి వస్తుంటారని, వీరికి అవసరమైన యంత్ర పరికరాలు ల్యాబ్‌లో లేకపోవడంతో గర్భిణులు, అత్యవసర కేసులలో క్షతగాత్రులు, రక్త పరీక్షలకు ఇబ్బంది పడటం జరిగిందన్నారు. ప్రస్తుతం ల్యాబ్‌కు సంబంధించి పరికరాలు అన్నీ సమకూర్చామన్నారు. తద్వారా శాశ్వతంగా రక్త పరీక్షలు పేద ప్రజలకు ఉచితంగా అందుతాయని వివరించారు. ఇప్పటికే గవర్నమెంట్ హాస్పిటల్లో 56 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు చెప్పారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ఈ- సిస్టం ఓపీని ప్రారంభించాలని, తద్వారా ఓపీ దగ్గర రోగులకు ఎక్కువ సమయం పట్టదన్నారు. దీంతో పాటు ఒక యాప్‌ని డౌన్లోడ్ చేసుకొని దాని ద్వారా వారే ఓపీని నమోదు చేసుకునే విధంగా ఈ-సిస్టం ఓపీని ఇంప్లిమెంట్ చేయాలని సూచించారు. దీంతోపాటు హాస్పిటల్లో క్యాంటీన్, ముందు వైపు ఉన్న ఖాళీ స్థలాన్ని వాణిజ్య దుకాణాలు నిర్మించాలని తీర్మానం చేశారు. తద్వారా వచ్చిన ఆదాయాన్ని హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కొత్త కంప్యూటర్లు, ఏసీలు కొనటానికి ప్రతిపాదనలు చేశారు. సమావేశంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, ఆర్ఎం ఓ శోభారాణి, డాక్టర్ సుజాత, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, మెడికల్ సూపర్వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో ఆర్థికాభివృద్ధి చెందాలి

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్

బాపట్ల: ఎస్టీలు ప్రభుత్వ పథకాల్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఎస్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివాసీలు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శాసనమండలి సభ్యురాలు పోతుల సునీతతో కలసి ఇన్‌చార్జి కలెక్టర్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్టీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాటన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒకప్పుడు అటవీ ప్రాంతంలో జీవించే వారంతా జనజీవన స్రవంతిలో కలిశారని గుర్తు చేశారు. మంచి సంస్కృతి, సంప్రదాయాలు పాటిస్తూ అభివృద్ధితో ముందుకు సాగాలని సూచించారు. పిల్లల్ని బాగా చదివించి, అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాలని చెప్పారు. ఆత్మస్థైర్యంతో అడుగులు ముందుకు వేయాలని తెలిపారు. ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని సూచించారు. ఎస్టీల సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్ ఫలాల్ని అందిపుచ్చుకుని అభివృద్ధి వైపు అడుగులు వేయాలని శాసనమండలి సభ్యురాలు పోతుల సునీత తెలిపారు. ప్రాచీన కాలం నుంచి నృత్యాలు, ప్రత్యేక సంప్రదాయాలతో ఆదివాసీలు మనగడ సాగించే వారిని గుర్తు చేశారు. కనుమరుగవుతున్న వారి సంస్కృతి, సంప్రదాయాల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఆదివాసీలంతా క్షేమంగా జీవించడానికి రాష్ట్ర ప్రభుత్వం తారతమ్యాలు లేని సమాజం నిర్మాణం కోసం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఎస్టీలు అభివృద్ధి వైపు అడుగులు వేసేలా అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఒకప్పుడు అటవీ సంపదపైనే ఆధారపడి జీవిస్తున్న వారికి ఆ భూములపై ప్రత్యేకంగా హక్కులు కల్పించిందని చెప్పారు. నాగరికతను సంతరించుకుంటూ విద్యారంగం వైపు ఎస్టీలు అడుగులు వేయడం సంతోషదాయకమని తెలిపారు.

సమాజంలో గౌరవంగా జీవించేలా చైతన్యవంతులు కావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారిణి జె. రాజదిబోరా, గిరిజన సంఘాల నాయకులు టి. సాంబయ్య, దేవరకొండ రాము, ఎస్. వెంకటేశ్వర్లు, బి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమం, శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి

- జిల్లా కలెక్టర్ శివశంకర్
- ఘనంగా టౌన్‌హాలులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



వేదికపై జిల్లా కలెక్టర్ శివశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా, ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: గిరిజనుల శ్రేయస్సు, సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం పురస్కరించుకొని గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో టౌన్ హాలులో నిర్వహించిన సభకు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టీనా, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒకప్పుడు అందరూ ఆదివాసీలమేనన్నారు. కాలక్రమేణా వచ్చిన మార్పులతో కొందరు కొండలు, గుట్టలకే పరిమితం కావడంతో వారు గిరిజనులుగానే ఉండిపోయారని తెలిపారు. గిరిజనులు నివాసం ఉండే ప్రాంతాల్లో 2005 డిసెంబరు 5న తెచ్చిన చట్టం ప్రకారం వారికి భూములు కేటాయిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వెల్దుర్తి, బొల్లాపల్లి, రాజుపాలెం లాంటి అటవీ ప్రాంతాలు ఉన్నచోట అవకాశం ఉన్నంతవరకు భూములు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 3,900మందికి ఏడు వేల ఎకరాల వరకు హక్కులు కల్పించామని వెల్లడించారు. ఒక్క 2022–23లోనే సుమారు 300మందికి పట్టాలు ఇచ్చామని తెలిపారు. ఎక్కడ అర్హత, హక్కులు ఉన్నాయో అక్కడ వారికి పట్టాలు ఇచ్చే బాధ్యత తమదని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ క్రిస్టీనా మాట్లాడుతూ గిరిజనుల్ని రాష్ట్రంలో ఉన్నతస్థాయికి తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని, వారి అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేసి ఆర్థికాభ్యున్నతికి పాటుపడుతున్నారని వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులతో నరసరావుపేటలో ట్రైబల్ వెల్ఫేర్ స్కూలు బ్రహ్మాండంగా నడుస్తోందని చెప్పారు. పిల్లలు చక్కగా చదవడంతో పాటు ఆటపాటల్లో ఉత్తమ ప్రతిభను చూపిస్తున్నారని తెలిపారు. నరసరావుపేట మండలంలోని పెదతురకపాలెంలో రూ.2.25కోట్లతో ప్రారంభించిన బాలబాలికలకు రెసిడెన్షియల్ స్కూలు, వసతి గృహాలు 80శాతం పూర్తయ్యాయని చెప్పారు. వచ్చే రెండుమూడు నెలల్లో పూర్తిచేసి పట్టణంలోని పిల్లల్ని అక్కడకు మారుస్తామని వెల్లడించారు. కోటప్పకొండలో గిరిజనుల సత్రం కోసం 40సెంట్లు కేటాయించామని, అక్కడ గదులు పూర్తిచేసి మంచి సత్రం అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. తొలుత కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ హెన్రీ క్రిస్టినా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులకు భూముల పట్టాల్ని పంపిణీ చేశారు. ట్రైబల్ వెల్ఫేర్ స్కూలు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ఎల్.వరలక్ష్మి, డీఎఫ్‌వో రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆషాభేగం ఖాజావలి, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, గిరిజన రెసిడెన్షియల్ స్కూలు ప్రిన్సిపాల్ ఎం.కుమారి, బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, గిరిజన ప్రజాసంఘాల నాయకులు విష్ణు నాయక్, కృష్ణా నాయక్, శ్రీనూ నాయక్, పాండూ నాయక్, రంగా నాయక్ పాల్గొన్నారు.

ప్రజలందరికీ ఓటుహక్కు ప్రభుత్వ ధ్యేయం

రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ–2024 పై జిల్లా కలెక్టర్ సమీక్ష

నరసరావుపేట: జిల్లాలో అర్హత కలిగిన ప్రజలందరికీ ఓటుహక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందు కోసం సిద్ధం చేస్తున్న ఓటర్ల జాబితా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో రాజకీయ అంశాలకు తావు లేకుండా, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందేలా సహకరించాలని ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. జిల్లాలో సంక్షిప్త ఓటర్ల జాబితా తయారీ కోసం సర్వే ప్రక్రియ కొనసాగుతున్న తీరును పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల్ని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా వెంటనే బూత్ లెవల్ స్థాయి అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ బూత్ ఏజెంట్ ప్రతినిధులు సర్వేను పరిశీలన చేయవచ్చని చెప్పారు. ఇందులో ఎటువంటి అనుమానాలున్నా నేరుగా తనకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ సర్వేకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని ఆయన కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, కలెక్టరేట్ ఏవో అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన బైక్

ఒకరి మృతి

జె.పంగులూరు: లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొండమంజులూరులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అమృతలూరి శ్రీనివాసరావు (38) జాతీయ రహదారిపై టీ తాగేందుకు ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. గ్రామం నుంచి బయటకు వచ్చే రోడ్డు మధ్యలో ఓ లారీని నిర్లక్ష్యంగా పార్క్ చేశారు. దీన్ని గమనించని శ్రీనివాసరావు వెనుక నుంచి దాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతడికి బలమైన గాయాలయ్యాయి. 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో చనిపోయాడు. లారీ రోడ్డు మధ్యలో ఉంచడమే కాకుండా, దాని వెనుక రేడియం స్టిక్కర్ కూడా లేకపోవడం ప్రమాదానికి కారణమమైంది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్‌ఐ కె.కె.తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

ఎస్‌పీవీఆర్‌కు అథ్లెటిక్ ఓవరాల్ చాంపియన్‌షిప్

గుంటూరు (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బీఆర్ స్టేడియంలో జరిగిన అండర్–10, 12, 14, 16 బాలబాలికల జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో చుండూరు మండలం యడ్లపల్లి గ్రామానికి చెందిన ఎస్‌పీవీఆర్ జెడ్పీ హైస్కూల్ ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. ద్వితీయ స్థానాన్ని చేబ్రోలుకు చెందిన ప్రెసిడెన్సీ స్కూల్, తృతీయ స్థానాలు లాంకు చెందిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్, గోరంట్లకు చెందిన నెక్స్‌జెన్ స్కూల్ నిలిచాయి. విజేతలను జీవీఎస్ ప్రసాద్ బహుమతులు అందజేశారు.

యార్డుకు 32,071 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 32,071 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 31,171 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.13,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,699 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఘనంగా ఆజాదీకా అమృత మహోత్సవ్ ప్రారంభం

- జిల్లాలో నేటి నుంచి 15వరకు నిర్వహణ
- లింగంగుంట్లలోని అమృత సరోవర్‌లో ప్రమాణం
- ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్



విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న జిల్లా కలెక్టర్

నరసరావుపేట రూరల్: జిల్లాలో ఆజాదికా అమృతోత్సవం ప్రారంభం మండలంలోని లింగంగుంట్లలో బుధవారం ఉత్సాహంగా సాగింది. జిల్లా నోడల్ అధికారి బీజే బెన్నీ, జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జోసెఫ్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన 'నా భూమి..నా దేశం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ హాజరయ్యారు. గ్రామంలోని అమృత్ సరోవర్ చెరువు వద్ద ఆయన శిలాఫలకం ఆవిష్కరించారు. దాని ఎదుట కార్యక్రమానికి హాజరైన శంకరభారతీపురం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు, గ్రామస్తులతో 'పంచ ప్రాణ ప్రతిజ్ఞ' చేయించారు. 'వసుధకు వందనం' కార్యక్రమంలో భాగంగా చెరువు చుట్టూ 75 మొక్కలు నాటారు. 'వీరులకు వందనం' కార్యక్రమంలో భాగంగా పదవీ విరమణ చేసిన ఆర్మీ ఉద్యోగులు వేములపాటి సీతారామిరెడ్డి, సానికొమ్ము రామచంద్రయ్య, గంగుల చంద్రశేఖరరెడ్డి, ఉరియ ఏడుకొండలు, కోట్ల కృష్ణారెడ్డిని సన్మానించారు. అమృత సరోవర్ చెరువు వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆ చెరువు గట్టుపై డ్వాక్రా మహిళలు, విద్యార్థులు, ఉపాధి హామీ వేతనదారులతో జాతీయ జెండాతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో డివిజనల్ రేంజ్ అధికారి నీలిమ, తహసీల్దార్ ఆర్.వి.రమణనాయక్, మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె.శివప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రిటైర్డు ఆర్మీ ఉద్యోగులకు సన్మానం

సెంట్రల్ జోన్ మహిళా క్రికెట్ జట్టు విజయం



54 పరుగులు చేసిన సెంట్రల్ జోన్ బ్యాట్స్ ఉమెన్ అంజుమ్

మంగళగిరి: నవులూరు ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం ఏసీఏ అండర్ –19 ఉమెన్ ఇంటర్‌జోనల్ వన్డే మ్యాచ్‌లో నార్త్‌జోన్ జట్టుపై సెంట్రల్ జోన్ జట్టు 97 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సెంట్రల్ జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 179 పరుగులు సాధించింది. జట్టు బ్యాట్స్ ఉమెన్లు మయస్సార్ అంజుమ్ 99 బంతుల్లో ఎనిమిది ఫోర్లతో 54 పరుగులు చేయగా మరో బ్యాట్స్ ఉమెన్ ఎండీ జట్రా మాహెక్ 57 బంతుల్లో నాలుగు ఫోర్లతో 30 పరుగులు చేసింది. నార్త్ జోన్ బౌలర్ పి.వెన్నెల మోహన్ నాలుగు ఓవర్లలో 21 పరుగులిచ్చి నాలుగు వికెట్లను సాధించింది. అనంతరం 180 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన నార్త్‌జోన్ జట్టు 32.1 ఓవర్లలో 82 పరుగులకే కుప్పకూలిపోయింది. జట్టు బ్యాట్స్ ఉమెన్ ఎస్‌హెచ్‌పీ హారిక 59 బంతుల్లో ఒక ఫోర్‌తో 20 పరుగులు చేసింది. సెంట్రల్ జోన్ బౌలర్ ఎం.పూజిత ఆరు ఓవర్లలో 14 పరుగులిచ్చి మూడు వికెట్లను పడగొట్టింది.

ల్యాప్‌టాప్‌ల ద్వారా జిల్లా ప్రజలకు సత్వర సేవలు



ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న జిల్లా కలెక్టర్, సంస్థల ప్రతినిధులు

నరసరావుపేట: ల్యాప్‌టాప్‌ల ద్వారా జిల్లా ప్రజలకు సత్వర సేవలు అందించాలని మండల కో–ఆర్డినేటర్లను కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. ఆయన బుధవారం క్యూబ్ రూట్స్ ఫౌండేషన్, నామ్ ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్ సహాయంతో కమ్యూనిటీ డెవలప్‌మెంటు కింద కలెక్టరేట్‌లోని కమాండ్ సెంటర్‌లో పనిచేసే మండల– కో ఆర్డినేటర్లకు పది ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. నియోజకవర్గ–కో ఆర్డినేటర్‌కు ఒకటి, జిల్లాకు ఒకటి చొప్పున అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, క్యూబ్‌రైట్స్ ఫౌండేషన్ చైర్మన్, ఆ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవం

గుంటూరు లీగల్: హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ 12వ అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టు జడ్జి పీవీఎస్ సూర్యనారాయణ మూర్తి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. అచ్చంపేట మండలం, గ్రంధశిరి గ్రామానికి చెందిన కిలారి నాగేశ్వరరావు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య లక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కిలారి నాగేశ్వరరావుకు నరసరావుపేట మండలం, పమిడిపాడు గ్రామానికి చెందిన జంపాని నాగేశ్వరరావు వరుసకు బాబాయి అవుతాడు. జంపాని నాగేశ్వరరావు భార్య చనిపోవడంతో పిల్లల్ని అక్కడే వదిలి గ్రంధశిరి వచ్చి కిలారి నాగేశ్వరరావుకు చెందిన రేకుల షెడ్డులో ఉన్నాడు. కిలారి, జంపాని ఇద్దరూ రోజూ ఇక్కడే మద్యం తాగుతూ ఉండేవారు. మేకలు కొనుక్కునేందుకు కొంత డబ్బు అప్పుగా ఇవ్వమని జంపాని కోరగా కిలారి రెండు లక్షలు ఇచ్చాడు. మేకలను కొన్న జంపాని కొంతకాలం తరువాత వాటిని అమ్మేశాడు. అయితే కిలారికి ఇవ్వాల్సిన అప్పు డబ్బులు ఇవ్వలేదు. దీనికితోడు కిలారి తమ్ముడు వరదయ్య మృతి చెందడంతో ఆయన భార్య హేమలత జంపానితో చనువుగా ఉంటుంది. ఈ క్రమంలో 2020 డిసెంబర్ 29న కిలారి తన అత్తకు ఒంట్లో బాగోలేదని తెలిసి తన భార్యను తీసుకెళ్లి అదే గ్రామంలో ఉన్న ఆమె ఇంట్లో వదిలిపెట్టి వచ్చాడు. మరుసటి రోజు ఉదయం ఆమె వచ్చే సరికి భర్త ఇంట్లో లేకపోవడంతో వెతకడం ప్రారంభించారు. జంపాని నాగేశ్వరరావుపై అనుమానంతో గది వద్దకు వెళ్లి కిటికీలో నుంచి చూడగా కిలారి తలకు రక్తం కారుతూ మంచంపై పడి ఉన్నాడు. తాళం పగులకొట్టి లోపలికి వెళ్లి చూడగా కిలారి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పక్కన ఇనుప కొడవలి, పొడవాటి చేతి గొడ్డలి ఉంది. వాటికి రక్తం మరకలు ఉన్నాయి. జంపాని నాగేశ్వరరావు కూడా కనిపించకుండా పోయాడు. దీంతో జంపాని నాగేశ్వరరావు, కిలారి హేమలత, కావూరి వెంకట్రావుపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు అనంతరం చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో జంపాని నాగేశ్వరరావుకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. మిగిలిన ఇద్దరిపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టేశారు. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ సీహెచ్.వి.సత్యనారాయణ కేసును వాదించారు.

పత్తిలో నానో యూరియా వినియోగించండి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.వెంకటేశ్వర్లు

ప్రత్తిపాడు: పత్తి పంటలో కనిపిస్తున్న బెట్ట వాతావరణ పరిస్థితులను అరికట్టేందుకు రైతులు నానో యూరియాను వినియోగించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని ప్రత్తిపాడు, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల్లోని పత్తి, సోయాచిక్కుడు పంటలను బుధవారం సాయంత్రం డీఏవో నున్నా వెంకటేశ్వర్లు పరిశీలించారు. పత్తి సాగు చేసిన రైతులతో మాట్లాడారు. పొలంలో బెట్ట పరిస్థితులు కనిపిస్తుండటంతో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను వివరించారు. పంటను కాపాడుకునేందుకు నానో యూరియాను ఎకరానికి ఒక లీటరు పిచికారీ చేయాలన్నారు. లేదా పొటాషియం నైట్రేట్ ఎకరానికి కేజీ పిచికారీ చేసుకోవాలని సూచించారు. పత్తి పంటను ఆశిస్తున్న రసం పీల్చు పురుగుల నుంచి పంటను కాపాడుకునేందుకు ఇమిడాక్లోరోప్రిడ్ ఒక ఎంఎల్ లేదా ఎసిటామిప్రైడ్ 160 గ్రాములు ఎకరానికి కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు వివరించారు. గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు తోటకూర శ్రీనివాసరావు, ప్రత్తిపాడు ఇన్‌చార్జి ఏవో బి. సుధారాణి, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వ పథకాల చేరువ లక్ష్యం

సమీక్షలో అధికారులకు జేసీ శ్యామ్ ప్రసాద్ ఆదేశం



అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: ప్రజలకు ప్రభుత్వ పథకాల్ని చేరువ చేసేందుకు జిల్లా అధికారులంతా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఏ. శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి బుధవారం ప్రభుత్వ పథకాల అమలుపై వెబెక్స్ ద్వారా ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా అసైన్‌మెంట్ పరిధిలో వ్యవసాయ భూములు, లంక భూముల వివరాల సేకరణ, అర్హులకు వాటి పంపిణీపై చర్చించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం, ఓటీసీ, ఓటీఎస్, రీసర్వే, ఎఫ్‌వోఎల్‌ఆర్, ఎఫ్‌లైన్ పిటిషన్లు, మ్యుటేషన్‌కు సంబంధించిన ప్రక్రియలు, తప్పుఒప్పులు సరిచేయడం, నీటితీరువ వసూలు, ఓఎల్‌సీఎంఎస్, ఇమామ్ భూముల అంశాలు, ఎన్నికల సర్వే ప్రక్రియ, ఈ– ఆఫీస్ వంటి అంశాలపై మండలాల వారీగా చర్చించారు. పనుల్లో ఎక్కడా జాప్యం లేకుండా జరిగేలా చూడాలని సంబంధిత శాఖ అధికారుల్ని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంతో పలు శాఖల ఉన్నతాధికారుల, అధికారులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న జీజీహెచ్ వైద్యులు

అనాథకు చికిత్స అందించి.. క్షేమంగా స్వస్థలానికి..



మహేంద్ర విష్ణుభగత్‌ను స్వస్థలానికి పంపుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్యులు

గుంటూరు మెడికల్: ఇతర రాష్ట్రానికి చెందిన రోగి పక్క జిల్లాలో ప్రమాదానికి గురై చికిత్స కోసం జీజీహెచ్‌కు వచ్చాడు. జీజీహెచ్ వైద్యులు అనాథగా ఆసుపత్రిలో చేరిన వ్యక్తికి పెద్ద మనస్సుతో వైద్య సేవలు అందించి కోలుకున్న తరువాత అతడిని స్వస్థలానికి పంపించారు. వివరాల్లోకి వెళితే నాగపూర్‌కు చెందిన మహేంద్ర విష్ణుభగత్ గత నెల 21న నాగపూర్ నుంచి చెన్నై వెళ్తుండగా చీరాల రైల్వే స్టేషన్ వద్ద ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో రెండు చేతులకు గాయాలయ్యాయి. గాయపడిన భగత్‌ను రైల్వే పోలీసులు గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తీసుకుని వచ్చారు. ప్లాస్టిక్ సర్జరీ విభాగం వైద్యులు రోగికి అవసరమైన పరీక్షలు చేసి చేతులకు పోయిన చర్మాన్ని తిరిగి ఏర్పాటు చేశారు. రోగి బంధువులు ఎవరు లేకపోవడంతో ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు అక్కున చేర్చుకుని వైద్య సేవలు అందించారు. ఆరోగ్యం పూర్తిగా కుదటపడడంతో అతడిని స్వస్థలానికి పంపించేందుకు ఆసుపత్రి సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్ ట్రైన్ టిక్కెట్ కొనుగోలు చేసి బుధవారం ఆసుపత్రి నుంచి నాగపూర్‌కు పంపించారు. ఈసందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ అనాథలకు సైతం జీజీహెచ్ వైద్యులు పెద్ద మనస్సుతో సేవలందించడమే కాకుండా, మానవతా దృక్పథంతో వారిని స్వస్థలానికి కూడా చేర్చడం అభినందనీయమని పేర్కొన్నారు. వైద్యు లు, వైద్య సిబ్బంది చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. రోగి బంధువులు సైతం జీజీహెచ్‌లో అందిస్తున్న వైద్య సేవలపై సంతోషం వ్యక్తం చేశారని, వైద్యుల సేవలను జీవితాంతం గుర్తుపెట్టుకుంటామని చెప్పారన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవింద నాయక్, సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ Direct 10th, ఇంటర్ అన్ని గ్రూప్స్, BTech, BSc, BCom, BA, BSW, MBA, MCA. BTech డిస్కంటిన్యూ స్టూడెంట్‌కి ఎగ్జామ్ సెప్టెంబర్‌లో కలవు ☏ 7386706899

■ శ్రీనివాస బిజినెస్ ఎడ్యుకేషన్ 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc, MA, M.Com, M.Sc. ✆ 99493 08940

DISTANCE EDUCATION

■ ఓపెన్ 10th, ఇంటర్ మరియు BA, B.Com, B.Sc, M.A, M.Com, M.Sc, MBA, MCA, ITI లకు పాస్ గ్యారంటీ శిక్షణ ఇవ్వబడును. సంప్ర॥ శ్రీ దివ్య ఇనిస్టిట్యూషన్స్, 2/3, అరండల్‌పేట, గుంటూరు. 7396755801

REAL ESTATE

FLAT FOR SALE

■ గుంటూరు బృందావన్ గార్డెన్స్ Zudio షోరూం ప్రక్కవీధిలో గల 'రాఘవ' అపార్ట్‌మెంట్ ఫేజ్-2, 1st ఫ్లోర్‌నందు 2 BHK ఫ్లాట్ నెం-603 అమ్మకమునకు కలదు. కన్‌స్ట్రక్షన్ ఏరియా 640 Sqft. & ల్యాండ్ షేర్ 34-6 Sq.Yards ✆ 91820 81904, 98666 82222

PLOT FOR SALE

■ గుంటూరు పలకలూరు రోడ్డు నందు 650 చ॥గ॥ స్థలం అమ్మకమునకు కలదు. చ॥గ॥ 57000/–లు మాత్రమే. సంప్రదించగలరు. 9440837515

■ తాడికొండ గ్రామంలోని MRO ఆఫీసు దగ్గర 3557.4చ॥గ॥ల స్థలం SBI ఈ-వేలం ద్వారా 18.08.2023 తేదిన అమ్మకమునకు కలదు. రిజర్వు ధర: 94లక్షలు. 6303031167

■ 896 చ॥గ॥ల స్థలము గుంటూరు సిటీ J.K.C. రోడ్ అదితి/ R.T.O.ఆఫీస్‌కి (Prime Location) దగ్గరలో ఇన్వెస్టర్స్‌కి, బిల్డర్స్‌కి ఉపయోగకరమైనది అమ్మబడును. డైరెక్ట్ పార్టీస్ Cont: 63097 63997

SERVICES

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్ : 9310615624, 8800496710

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 9912105656

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును.(స్పాట్‌క్యాష్).సంప్ర✆ 88024 89999

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థల లో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ (100% జెన్యూన్). సంప్ర : ✆ 945 945 3338

OLDAGE HOME

■ హరేకృష్ణ హోంకేర్ వంట/ ఇంటిపని పేషెంట్స్‌ను, వృద్ధులను, పిల్లలను 24 గం॥లు చూసుకోవడానికి మీ ఇంటివద్దకే పంపబడును. విజయవాడ ఫోన్ 9840628899/ 9840638899

WANTED

■ గుంటూరు మంగళదాస్‌నగర్‌లోని సిమ్స్ కళాశాల నందు హాస్టల్ వార్డెన్స్ జంట్స్ కావలెను. ఆసక్తి గల వారు సంప్ర॥ ☏ 9703984444, 6303022024

■ కృష్ణసాయి క్లాత్‌శారీస్ నందు పని చేయుటకు హెల్పర్లు పురుషులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర॥ అశోక్ నగర్, 4/1, గుంటూరు ☏ 9885513844

■ ఉచిత రెండునెలల హోటల్‌మేనేజ్‌మెంట్ కోర్సులు ఫ్రీ యూనిఫామ్, మెస్‌బుక్స్, కంప్యూటర్ కోర్సులు ఫ్రీ వసతి భోజనం. ప్రముఖ స్టార్ హోటల్స్‌లో ఉద్యోగాలు ఒక సం॥ తరువాత విదేశాలలో ప్లేస్‌మెంట్,అ: 10th. వ:18–30సం॥ 9908739858, 8919170674

■ Youtube Video's క్రియేట్ చేయుటకు అనుభవం కలిగిన స్టాఫ్ కావలెను. గుంటూరు లోకల్ వారికి ప్రాధాన్యత. ఆకర్షణీయమైన శాలరీ. 9849414145

■ యడ్లపాడు మం॥ వంకాయలపాడులో గల ప్రముఖ సిమెంట్ పోల్స్ తయారీ కం॥ నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్, Tally అనుభవం గల అకౌంటెంట్ కావలెను. మంచిజీతం. 9490157858

■ 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్న వారికి ఆఫీసులు, షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్ Ltd కంపెనీల్లో మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కలవు. ఓల్డ్ ఆఫీసు వద్ద. సంప్ర: 9963255441

■ తెనాలిలోని ప్రముఖ ట్రాన్స్‌ఫార్మర్స్ కంపెనీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్, అకౌంటెంట్ (Tally అనుభవంతో) కావలెను. అనుభవం బట్టి మంచిజీతం. 9490157852

■ కేర్‌టేకర్ కావలెను. గుంటూరులో మా ఇంట్లోనే ఉండి పెద్ద వయస్సు గల మగవారిని ఇంటి వద్ద మరియు ఆఫీసు వద్ద బాగోగులు చూసుకొనుటకు ఏ బాదరబంది లేని మగవారు మాత్రమే కావలెను. కనీసం 10వ తరగతి చదివి ఉండవలెను. జీతము: 12000/- + బోనస్ : 40000/- మరియు భోజనం, వసతి కల్పించబడును. వివరములకు 9010299252 ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

■ సాయిధరణి రియల్‌ఎస్టేట్ కంపెనీలో పని చేయుటకు ఆఫీస్‌బాయ్ మరియు కంప్యూటర్ ఆపరేటర్ మరియు టెలికాలర్స్ కావలెను.Cont: 6300313919, 13/1 అరండల్‌పేట, గుంటూరు.

■ లేడీ టెలికాలర్స్ కావలెను. అర్హత: Inter to Degree, జీతం: 7000/- to 12000/-, Time: 9:30am to 5:30pm. అడ్రస్: RTC బస్టాండ్ దగ్గర, గుంటూరు. 7671080354

■ గుంటూరులోని మా సంస్థ నందు పని చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. నో టార్గెట్స్. జీ:8000, వ:18–45సం॥ సంప్ర॥ ☏ 8500347916

■ వెంటనే కావలెను. LTD కంపెనీల్లో డేటా ఎంట్రీ, టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్, మని రికవరీ, ఆఫీస్ క్లర్క్స్, హెల్పర్స్. అర్హత: 10th-PG. 7993976590

■ HDFC / ICICI / Kotak / AXIS వంటి ప్రైవేటు బ్యాంకులలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు కలవు. వ:40సం॥లోపు, జీ:21500 ☏ 7671027880 GNT,Vijayawada

■ మందాడి, మాచర్ల, ఫిరంగిపురం, కొండమోడు ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. రూమ్‌ఫ్రీ. జీతం: 12000. ☏ 7569673994

■ బ్యాంకింగ్ సెక్టార్‌లో అనుభవం ఉన్న లేడి కౌన్సిలర్ & లేడి టెలికాలర్స్ కావలెను. అ: B.Tech, MBA, MCA గుంటూరు లోకల్ వారికి ప్రాధాన్యత. 90100 35222

■ Wanted Experienced NS Teacher to Work at Cherukupalli. Good Salary will be given as per Experience ✆ 9989760123, 9391280388

■ గుంటూరు జిల్లాలోని HDFC, ICICI, Axis, Kotak వంటి ప్రైవేటు బ్యాంకులలో ఉద్యోగ అవకాశములు కలవు.Qul:7th-PG.Age: 50సం॥ లోపు. Sal:15000-35000 ☏ 7386879373

■ Wanted Sales Executives for NEXA Car Showrooms in Guntur & Narasaraopet. Experience/ Freshers in sales can apply. 9100787054

■ బార్ & రెస్టారెంట్‌లో పనిచేయుటకు P/T, F/T వెయిటర్లు, సప్లయర్లు, కిచెన్ సూపర్‌వైజర్లు కావలెను. భోజన వసతి సౌకర్యం కలదు ☏ 9573271161, 8143198968

■ జాబ్స్: టెలీకాలర్‌లు, సెక్యూరిటీ గార్డులు, హౌస్‌కీపింగ్ లేడీస్, సిసి టివి ఆపరేటర్, ఆయాలు కావలెను. ✆ 89853 83633 / 89855 97933

■ మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95738 33520, 90596 33520.

■ మంగళగిరి లోని ప్రముఖ యూనివర్శిటీ నందు సెక్యూరిటీ, సెక్యూరిటీగార్డ్స్-50, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్-10, (M/F)కావలెను. జీతం: 13,15వేలు, 2 W Off, PF + ESI Qul:10th, Degree. డ్యూటీ: 12గం॥లు ✆ 78427 05192

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ.18k హైదరాబాద్. 9640258899, విజయవాడ: 9640648899.

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్ : 9391036931, 9246585901

■ మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు. విభాగం: ఇంజిన్, డెక్, కుక్. వయసు : 18–28. అర్హత:10వ తరగతి ఉత్తీర్ణత & అంతకంటే ఎక్కువ. Makira Marine Services Pvt. Ltd. Hyderabad (Telangana), Palakkad (Kerala) Ph: 6238686422.

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం

ఈ పెర్కొనలో ప్రకటనల కొరకు సంప్రదించండి గుంటూరు 97030 13015 97034 67843 92904 02000

గమనిక సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.